

# ఒకరోజే రాజు

రాజ్ శ్రీనివాస్

పెళ్ళికారు ఊరి పొలిమేర దగ్గరకు చేరగానే రణగొణధ్వని మొదలైంది. ఓ పది పదిహేను మంది చిన్నపిల్లలు కోలాహలంగా కారొచ్చింది... కారొచ్చింది, అంటూ అరవడం మొదలెట్టారు. ఓ బుగ్గమీసాల రాజుగారు "వాయించండోయ్" అంటూ బేండ్ వాళ్ళని హుషారుచేసారు. ఎవరూ పోల్చుకోలేని సినిమాపాటొకటి కర్ణ కఠోరమయిన శబ్దంతో బేండ్‌మీద మొదలయింది.

అప్పుడు, ఓ పది పదిహేను శాల్తీలు నిటారుగా నడుస్తూ కారు ముందు బయల్దేరేయి. వాటి వెనకాలే వెమ్మదిగా నడుస్తూ బేండు, బేండువెనకాల నడుస్తుందా లేదా అనిపించేంత నెమ్మదిగా కారూ కదిలేయి.

"పెళ్ళి కొడుక్కారొచ్చిసింది? మరి పెళ్ళివారి బస్సింకారాలేదూ" అంటూ హడావిడిగా కొన్ని శాల్తీలు ముందుగుంపులో కలుస్తున్నాయి. అందులోంచి ఓ రంగువెలిసిపోయిన జరీపంచె కట్టుకున్న శాల్తీ ఒకటివచ్చి కారు బేక్‌డోర్‌దగ్గిర వంగి "ఏవోయ్ చినబాబూ బస్సేది" అంది హడావిడిగా. "బస్ "అచితాపురం" సంతదగ్గిర కొంచెం వెనకబడింది. ఈపాటికొచ్చియ్యాలండీ సూరిబావజీ" అన్నాడు చినబాబు.

"అన్నట్టేవేళ అచ్చితాపురం సంతగదూ, అయితే వస్తుంటారీపాటికి అదిగో హారనూ సరే, టైమయిపోయింది, విడిదొకటుందిగదూ, పెళ్ళికొడుకుని బేగా తయారుచెయ్యొద్దు"? అంటూ ఈ కోలాహలానికంతటికీ కారణమయిన పెళ్ళికొడుక్కేసి పలకరంపుగా నవ్విసిరి, కేవ్‌మని అరిచినంతపంజేసి "ఏవోయ్ చినబాబూ తలపాగా ఎవరుకట్టేరు, పాగా కుదరలేదు ఆపిన్నీసేటలా కనబడీలా పెట్టేసేరు. అబ్బే! పాగాకి అందవేలేదు విడిదిలో మార్చెయ్యాలి" అన్నారు.

ముందుసీట్లో పెళ్ళికొడుకు ప్రాణస్నేహిడొకడు కూర్చున్నాడు. అతనికిదంతా చాలా గందరగోళంగా అన్పిస్తోంది. వెనక్కి తిరిగి చూసేడు. చూసి ఫక్కుమని నవ్వబోయి ఆపుకున్నాడు. చిన్నతలమీద లేత ఎరుపు రంగు తలపాగా బుట్టపెట్టినట్లు ఉంది. తలపాగాకి ముత్యాలహారం కష్టపడి తగిలించేరు. చామనచాయ మొహానికి, ఆరంగుతలపాగా, బుగ్గన చుక్క, కళ్ళకి కాటుక, "ప్రేవ్‌నగర్"లో జమీందార్ డ్రెస్‌లా లూజు షర్వా... కొత్తగా తమాషాగా కన్పించి "ఈ వేషంతో గురుణ్ణో రోజు ఆఫీసుకి తీసుకెళ్ళాలి" అనుకున్నాడు.

కారు విడిదిదగ్గిర ఆగింది. బేండు కూడా ఆగిపోయింది. ముందు సీట్లోంచి సుధాకర్ దిగుతూ 'అమ్మయ్య! బేండ్ ఆగిపోయేసరికి ప్రపంచం ఎంత నిశ్శబ్దంగా ఉంది' అనుకున్నాడు. వెనకాలే పెళ్ళిబస్ వచ్చింది.

విడిదిలోంచి హడావిడిగా రాజులంతా బయటికొచ్చేరు.

"ఏవండోయ్ బావా! చేన్నాళ్ళకి" "దయచేయండి" "దయచేయండి" "స్నానాలు చేస్తారా" అన్ని గొంతులూ ఒకేసారి వినిపిస్తున్నాయి.

పెళ్ళికొడుకు సాంబశివరాజు నెమ్మదిగ కారుదిగేడు. దిగి నిటారుగా నిలబడ్డాడు. దగ్గిర దగ్గిర ఆరడుగుల పొడవూ, దానిమీద తలపాగా మొత్తంకలిసి ఇంకా పొడవుగా కనబడుతున్నాడు. అతను కారుదిగ్గానే అతను కన్పించేంతదూరం ఇళ్ళలో కిటికీలు తెరుచుకున్నాయి.

అందులోంచి ఆడవాళ్ళు తనవేపు చూస్తున్నారనే ఫీలింగ్ రాగానే సిగ్గుపడ్డాడు. తొందరతొందరగా నడవడానికి అడుగువెయ్యబోయేడు. చినబాబు ఇవతలవెయ్యి అతని బావ వర్మ అవతలవెయ్యి పట్టుకుని నెమ్మదిగా నడిపించడం మొదలెట్టేరు.

"ఏవిటోయ్ అంతకంగారు, ఈవేళ నువ్వేవీ స్వతంత్రించీకు బాగోదు... అంతా నీకేసే చూస్తారు. మొహవేమిటలాపెట్టేవ్, మెడవాల్చీకు, మొహం గంభీరంగా పెట్టకు... కొంచెం నవ్వుమొహం పెట్టు" అంటూ రెండుచెవులూ ఇద్దరూ పంచుకున్నారు. వీధిగుమ్మం దగ్గిరనుంచి వరండా దగ్గిరకొచ్చి మెట్లు పూర్తిగా ఎక్కేసరికి ఐదునిముషాలు పట్టింది. విశాలమయిన వరండా, అక్కడ... ఇక్ష్వాకుల కాలంనాటి ఓ పెద్ద క్రకుర్చీ ఉంది. జాగ్రత్తగా పెళ్ళికొడుకుని తీసుకెళ్ళి అందులో కూర్చోబెట్టేరు. కుర్చీమధ్య కూర్చుని వెనక్కి జేరబడేసరికి నేత్తిమీద ఓ అడుగున్నర స్థలమూ, కుర్చీలో ఇటో అరగజమూ, అటో అరగజమూ మిగిలిపోయింది. రెండు చేతూలూచాపి కుర్చీచేతుల్ని పట్టుకుని, పెద్దవాళ్ళ జోళ్ళో చిన్నకుర్రాడి కాలులా ఇబ్బందిపడుతూ ఆ కుర్చీలో కూర్చున్నాడు. గబగబా ఓ టేబిల్‌ఫేన్ వచ్చింది. వర్మ, చెంపలమీద పట్టిన చిరుచెమటని తువ్వాలుతో సుతారంగా తుడిచేడు. వరండా వెనకాల గదులున్నాయి. ఆ గదుల కిటికీలుకూడా తెరిచే ఉన్నాయి. కిటికీ అవతలనించి అందమయిన ఆడతలలు పరీక్షగా పెళ్ళికొడుక్కేసి చూస్తున్నాయి. పెళ్ళివారంతా విడిదిగదుల్లోకి నడిచారు. విశాలమయిన రెండు గదుల్లో పెళ్ళివారంతా సర్దుకున్నారు. గదుల్లో టార్పాలిన్స్ వేసేరు. పెళ్ళికొడుక్కి చిన్నగది ఒకటిచ్చేరు.

బస్‌లో దిగినవాళ్ళు ఓసారి పెళ్ళికొడుకు దగ్గిరకొచ్చి పలకరింపుగా నవ్వి లోపలికేళ్తున్నారు. ఈలోపల తుఫానులా మరో జరీకండువా దూసుకొచ్చింది. "ఏవోయ్ వర్మా! పెళ్ళికొడుకునిలా కూర్చోబెట్టేసేరేటి? టైమయిపోయింది. తొందరగా స్నానంచేయించి, రెడీచేయండి. ముందు విడిదాకటుందిగదా... విడిది... విడిధయిపోగానే భోజనాలు... పాపం ఆళ్ళకి అలిసం అయిపోదూ...? తొమ్మిదోగంటకల్లా పీటలమీద కూర్చోవాలి. ఇంటేటాలిసం".

"ఏవండోయ్ మావయ్యా! ఆదులరాజుల క్రింద మీరేనావచ్చారు. వచ్చి గొప్పఘనంగ చేయించేర్లెండి ఏర్పాట్లు. పెళ్ళికొడుక్కి అధాన్యం కొట్టాశివ్వడం. అందులో సూట్‌కేసులూ, విడిది ఫలహారంపెట్టే తప్ప మరింకేంపట్టవు. అందులోనే పెళ్ళికొడుకుని తయారు చెయ్యాలా?" అన్నాడు చినబాబు.

"నన్నేంచెయ్యమంటావోయ్, ఆళ్ళదిగో ఆరెండు గదులూ ఈ చిన్నగదీ వాడుకోమన్నారు. ముందొస్తే మాత్రం ఆళ్ళతో తగువాడమంటావా? నువ్వు చెప్పేది బావుందోయ్."

గొడవంతా ఆలకిస్తున్న ఆడపెళ్ళివారితరపు మీసాల




రాజుగారొహోయన...

"బావా, మావోళ్ళవల్ల ఏదో పొరపాటయిపోయింది, రెండు నిమిషాల్లో నడవ ప్రక్కనున్న మూడోగది కాళీ చేయిస్తాను. ఈలోగా బాత్‌రూంలో స్నానంచేయించేయండి... స్నానంచేయించేసరికి అంతా రేడీచేయించేస్తాను" అన్నారు చినబాబు చేతులుపట్టుకుని.

తలఊపి లోపలికినడిచారు పెళ్ళికొడుకూ, పరివారమూ...

పెరట్లో నూతిదగ్గిర ఓ ఐదుగోలేలనిండా ఇద్దరు పాలికాపులు నీళ్ళుతోడుతున్నారు. ఇస్త్రీతువ్వాళ్ళు ఐదో, ఆరోపట్టుకుని ఆడపెళ్ళివారితరపు కుర్రవాడొకడు నిలబడ్డాడు. నాలుగు క్రొత్తసబ్బులు నూతిపక్కనున్న కుండీమీదున్నాయి. ఒకరి తర్వాత ఒకరు స్నానాలకి సిద్ధపడ్డారు. స్నానాలు పూర్తయినవాళ్ళు లోపలికొచ్చి గదుల్లో బట్టలుమార్చుకుని మేకప్ పూర్తిచేసుకొంటున్నారు. పెళ్ళివారంతాకల్సి సుమారు వందమంది వరకూ ఉన్నారు. అంతా గబగబా స్నానాలు పూర్తిచేసి తయారయ్యేసరికి విడిదింట్లోకి కాఫీలు, టిఫిన్లూ వచ్చేసాయి. కార్యక్రమం అంతాపూర్తయింది. నలుగురితో పాటు సుధాకర్‌కూడా పూర్తిచేసి వీధిలోకి వచ్చేడు. అతడికిదంతా చాలా తమాషాగా అన్పిస్తోంది. ఆమర్యాదలూ, "ఆయ! ఆయ! దయచేయండి" లాంటి ప్రత్యేకమయిన పదాలూ, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యాలూ, ఒకర్నొకరు వ్యంగ్యంగా పలకరించుకోవడం, మగపెళ్ళివారి దర్జా ప్రదర్శించడం అంతా అతనికి కొత్తగా ఉన్నాయి. సాంబశివరాజు తమ్ముడు శ్రీను దగ్గిరుండి పందిరిక్రింద ఏదోచేయిస్తున్నాడు. అక్కడికి వెళ్ళాడు సుధాకర్.

అక్కడ ఆడపెళ్ళివారు హడావుడిగా టార్పాలిన్స్ వేస్తున్నారు. సూరిబావాజీ, ఇంకా రెండుమూడు జరీ పంచెలూ, పర్యవేక్షిస్తూండగా శ్రీను కొత్తపరుపు "సింహాసనం"లా తయారుచేస్తున్నాడు. ఓ పదినిముషాల్లో "సింహాసనం"లా తయారైంది. మెత్తటిపరుపు... చేతులానుకోవడానికి పెద్దపెద్ద దిళ్ళు. "తానీషా దర్బారు"లా తయారైంది. ఎదురుగా వెండిపళ్ళెం... వెండి గంధపు గిన్ని... వెండి పన్నీరు బుడ్డి... అగరు వత్తుల పరిమళాలు... శ్రీనునడిగాడు సుధాకర్.... "ఇదంతాఏమిటి?"

"దీన్నే విడిదంటారు, ఇప్పుడు లగ్నపత్రికలు చదువుతారు. విడిది పలారాలు వాళ్ళుతెస్తారు. నాకూ అంతే తెలుసు" అన్నాడు శ్రీను.

సుధాకర్ అక్కణ్ణించి పెళ్ళికొడుకుదగ్గిర కెళ్ళేడు. అక్కడికి వెళ్ళేసరికి సాంబశివరాజుకి కల్యాణతిలకం ఎనిమిదోసారి చెరిపి సరిగ్గాపెట్టే ప్రయత్నం జరుగుతోంది. మొత్తానికి మరో రెండుసార్లు చెరిపి ఇంటిపేర్లతో ఒకర్నొకరు దెప్పుకుని తిలకందిద్దేరు. అప్పటికి పెళ్ళికొడుక్కి శోషొచ్చినంత పనయింది.

"ఇదేవిటోయ్ బాబూ! ఇంకాఇలాగే ఉన్నారు, ఇంకేప్పుడోయ్! ఓయ్! తలపాగా ఎవరిచేతకట్టిద్దావని. ఇందాక కార్లోకట్టిన తలపాగా బావులేదు. లక్ష్మింపతేడీ? ఆడు తలపాగా బాగాకడతాడు. ఓయ్ లక్ష్మింపతీ ఇటావోయ్ అవతల ఆలిసం అయిపోతుంది" అన్నడు సూరిబావాజీ. లక్ష్మింపతొచ్చేడు. ముప్ఫైమూడు డైరెక్షన్లతో తలపాగా పూర్తయింది.

సుదాకర్ ఇందంతా పరీక్షగాచూస్తున్నాడు. నిన్న "శివ"గాడు చెప్తుంటే ఏమోలనుకున్నాను. "మా పెళ్ళిళ్ళు చూడ్డానికి మంచి తమాషగా ఉంటాయ్ గురూ. నీకు మంచి కాలక్షేపం, రేపు నువ్వు నన్ను పోల్చుకోనేలేవు" అన్నాడు. నిజవే, వింతగా ఉన్నాయి ట్రెడిషన్సు అనుకున్నాడు. మరీ సన్నగా లేకపోయినా ఆపొడవుకి, ఆడ్రెస్‌లో సన్నగా కనబడుతున్నాడు పెళ్ళికొడుకు. షుర్వా, లాం కోటూ మాత్రం ఏమీ నప్పలేదు. మళ్ళీ యథాప్రకారం పెళ్ళికొడుకు రెండు చేతులూ ఇద్దరూ పంచుకుని నెమ్మదిగా నిడిపించుకుంటూ పందిరికింద "తానీషా దర్బారు" దగ్గిరకి తీసుకొచ్చారు.

"ఇదంతా ఏమిటి?... ఈ నడిపించడాలేవిటి అందరూ నాకేసి చూడ్డవేవిటి? ఈ తతంగం ఏమిటి? అంతా బొష్! నాన్సెన్స్!... అలవాటయిపోవడం వల్ల ఏవీ అనిపించడలేదు గానీ, బయటివాళ్ళకి గొప్ప నవ్వులాటగా ఉంటుంది గ్రామోను ఈవ్యవహారం అంతా... నడవలేనివాళ్ళా వీళ్ళిద్దరూ నారెండు చేతులూపట్టుకుని మెల్లగా నడిపించడం... ఇదంతా ఏమిటి ట్రాష్..." సాంబశివరాజు ఇలా అనుకుంటూండగా, ఎడమచెవిలోంచీ, కుడిచెవిలోంచీ గుసగుసలు...'తలదించీకు, నవ్వు... నవ్వుమొహంపెట్టు' లాంటి సలహాలు వినిపించేసరికి మరీ బిగుసుకుపోతూ, నెమ్మదిగా కృత్రిమ సింహాసనంమీద మఠంవేసుకుని కూర్చున్నాడు. అక్కడికి ఫేను తీసుకునిరావడం కుదరకపోవడం వల్ల విసరడానికి ఓ మనిషి తయారయ్యేడు. "గొప్ప సుఖంగా ఉందీ సింహాసనం"— అయితే ఒకటే సవరణ. ఈ

జనం లేకుండా ఉంటే అనుకున్నాడు. సుధాకర్ నెమ్మదిగా సాంబశివరాజు ప్రక్కనేకూర్చున్నాడు. ఫోటోలు మొదలయ్యాయి. సాంబశివరాజు తమ్ముడు శ్రీను ఫోటోలుతియ్యడం మొదలుపెట్టాడు. పెళ్ళికొడుక్కి ముందు మూడుగజాల దూరంలో ఓ నిలువెత్తు అద్దం అమర్చారు. అందులో పెళ్ళికొడుకు ప్రతిబింబం కనబడుతోంది. ఇరుప్రక్కలా పెద్దలంతా కూర్చున్నారు. ఒకప్రక్క మగపెళ్ళివారు... ఒకప్రక్క ఆడపెళ్ళివారు... రాజులంతా బుంగమీసాలు, జరీ కండువాల్తో, లేని గాంభీర్యం ఒలకపోస్తున్నారు. అందులోకొందరు ఒకర్నొకరు నలోక్తించుకుంటున్నారు... కుర్రరాజులంతా ఊరుమాడ్డానికి బయలుదేరడంతో పందిరిలో కోలాహలం చాలామట్టుకి తగ్గిపోయింది. పంతులుగారు సిద్ధమయ్యారు. యాధాలాపంగా ముందుకిచూసిన సుధాకర్ కళ్ళు పెద్దవయాయి. అతనింతవరకూ అటువంటివి చూళ్ళేదు. రెండువర్గాలకీ మధ్య పెద్ద పెద్ద పళ్ళేలనిండా ఫుట్‌బాల్‌సైజులో మిఠాయి, సున్ని, బంగినపల్లి మావిడిపళ్ళు... పాలకోవాతో తయారు చేసిన జీడిమావిడి పళ్ళు... అంతా కన్నులపండువగా ఉంది. మొత్తం తొమ్మిది పళ్ళేలున్నాయి. అన్నీ నిండుగా ఉన్నాయి. వాటిసైజులు చూడగానే వీటిని తయారు చెయ్యడానికి చాలా శ్రమపడి ఉండాలి అనుకున్నాడతను. ఇందాక శ్రీను విడిదిఫలారం అన్నాడు అంటే ఇదన్నమాట. ఇదంతా ఫలారవా! అనుకున్నాడాశ్చర్యంగా.

తంతు మొదలయింది.

లగ్నపత్రిక చదువుతున్నాడు పంతులు...రాజులంతా పంతులి కంఠశోషని కొంతసేపు మెచ్చుకున్నారు. "మన తాలూకా మొత్తంమీద ఈ రకంగా మంత్రం చదివేవోడు మరోడు లేడండీ బావా! మంచి శాస్త్రోక్తంగా చేయిస్తాడీయన" అని అంతా పంతులు గార్ని పొగిడేరు. కొంతసేపటికి విడిది పూర్తయింది. అంతా లోపలికి నడిచేరు. విడిది "ఫలారా"లన్నీ పెద్ద పెట్టెలోకి జాగ్రత్తగా సర్దింపించేరు. "వడ్డనలయిపోయేయి దయచేయండంటూ" పిలుపొచ్చింది. అక్కడికి కూతవేటు దూరంలోనే కన్యాదాతగారిల్లు. "మనవాళ్ళంతా భోజనానికి వెళ్తున్నారు నువ్వుకూడా భోంచీ" అన్నాడు సాంబశివరాజు.

"మరి నువ్వో" అన్నాడు సుధాకర్.

వర్మ అందుకుని "ఆడివ్వేళ తినగూడదు 'ఫలారవే' ఏవండోయ్ మావయ్యా పెళ్ళికొడిక్కి 'ఫలారం' పంపించమనండి. నాకూ, చినబాబుకీ కూడా భోజనం క్యేరేజీలో పెట్టి పంపించమనండి. మేం ఇంక అక్కడికి రాం". అలాగే అని ఆయన బయలుదేరేడు.

"దయచేయండి, దయచేయండి"లాంటి స్వాగత వచనాలందుకుంటూ నలుగురితోపాటు సుధాకర్‌కూడా భోజనాల దగ్గిరకి నడిచేడు. నేలమీద దుప్పటి మడత పెట్టి పరచి, ముందు విస్తట్లో కొంచెం కొంచెంగా అన్ని పదార్థాలూ వడ్డించి ఉన్నాయి. అప్పుడే భోజనమేవిటి? అనుకున్నాడు సుధాకర్ వాచీ చూసుకుని. టైము ఆరూ నలభై అవుతోంది. "ఇలారండి. ఇక్కడ కాళీవుంది" అని శ్రీను పిలిస్తే వెళ్ళి అతని ప్రక్కన కూర్చున్నాడు.

అందరూ కూర్చోగానే వడ్డనలు ప్రారంభం అయ్యాయి. పధ్నాలుగు, పదిహేనేళ్ళ కుర్రాళ్ళు గ్లాసుల్లో మంచినీళ్ళు పొయ్యడం మొదలుపెట్టారు. "నెయ్యొడ్డించుకుంటారా!" అంటూ పరిమళాలు వెదజల్లే గేది నెయ్యిని అన్ని వరుసల్లోకి సరఫరా చేస్తున్నారు. మరో పది నిముషాలు గడిచేయి. అందరూ "బాబూ పెరుగు పచ్చడి...పెరుగు పచ్చడి...పలావు...పలావు" అంటున్నారు. అందరూ అదే అడుగుతున్నారేవిటి అనుకున్నాడు సుధాకర్. శ్రీను ఆకుకేసి చూసాడు. ఆకునిండా పచ్చడీ, పలావూ ఉన్నాయి. ఇంకా తెమ్మంటున్నాడు.

"ఏవిటండోయ్ పలావు తెగపట్టిస్తున్నారేవిటి కథ" అన్నాడు సుధాకర్.

"పలావూ పెరుగుపచ్చడీ కొంచెం తక్కువ ఉన్నాయట" అందుకు.

"తక్కువుంటే"?

"లేదనిపించడానికి".

ఓహో! తక్కువేదుంటే అది అడిగి కాళీచేసి తెచ్చేవాళ్ళింక లేదు మొర్రో అని నమస్కారం చేస్తే పెళ్ళికానందనా! ఇదొకటా? అనుకున్నాడు.

కొంతసేపు ఏడిపించింతర్వాత పెద బావాజీ వచ్చి అందర్నీ గసిరేసరికి అంతా సద్దుమణిగింది. ఒక టైము మాత్రం మందు బేవీ...వాళ్ళకి ప్రత్యేకంగా వడ్డిస్తూ మిగిలిన ఆకులు తీసేసారు.

భోజనం చేసింతర్వాత జనాలంతా "మీ ఊళ్ళో సినిమాహాలన్నా లేదండీ బాబూ, వచ్చినట్టు పెళ్ళి చూడవలసిందే!" అని బాధపడిపోతూ కొంతమంది పేకాట దగ్గిరా కొంతమంది విడిదిలోనూ సర్దుకున్నారు.

సుధాకర్ మళ్ళీ వెనక్కి తిరిగి "విడిది" దగ్గిర కొచ్చేడు. పెళ్ళికొడుకు 'ఫలారం' చేస్తున్నాడు. పెళ్ళి పక్కనే కూర్చున్నాడు. "ఏం బ్రదర్, మీల్స్ అదీ ఎలా ఉంది" అన్నాడు సాంబశివరాజు. "అంతా బానే ఉంది గానీ మీవాళ్ళు కొంచెం అల్లరిచేసేరు" అన్నాడు సుధాకర్. "భలేవారండీ బాబూ మీరు. అదింకా తక్కువ. మాదాంట్లో అల్లరి బేవీ లేదసలు, ఏదో సరదాకి కొంచెం చేసుంటారుగానీ మొన్న మా "గుమ్మలూరు" పెళ్ళి చూడవలసింది మీరు. భలే తమాషాలెండి" అన్నాడు వర్మ గొప్పగా. భోజనాలు చేసి ఆకబురూ, ఈకబురూ చెప్పుకునేసరికి ఎనిమిదిన్నరవుతోంది. మళ్ళీ ఇందాకటి జరీ కండువా పరుగెత్తుకొచ్చింది.

"ఏవోయ్! చినబాబూ! ఇంకా అలాగే ఉన్నారు, పెళ్ళి కొడుకుని సిద్ధం చెయ్యండి, టైమవుతోంది" అంటూ.

"అంతా రెడీయేగాని, ఒరే సాంబా! నువ్విందాక విడిదిలో బుర్రటూ ఇటూ తిప్పి దిక్కులుచూడ్డం మొదలెట్టేవు. నీకేదైనా కావలిస్తే నువ్వు వంగిఅడగక్కర లేదు. చిన్న కనుసైగ చెయ్యి. మేం ఉన్నాం గదా. అంతేగానీ బుర్రదీ అటూ ఇటూ తిప్పకు. మాట్లాడ్డం అదీ చెయ్యకు. ఈ వేళ నువ్వు రాజులాటి వాడివి. నీకు ఎదురు లేదు. అసలే "రాంబిల్లి". బాగోదు. ఈ ఊళ్ళో అన్నీ బాగా పట్టించుకుంటారు".

సుధాకర్‌కి రాజా-పేద నవల్లో "టాం-కాంటీ"పాత్ర గుర్తొచ్చింది. అది చదువుతున్నప్పుడు నిజమేనా అన్న అనుమానం వొచ్చింది తనకి. నిజమే అయుండాలని పిస్తోందీ పెళ్ళి చూస్తుంటే. మళ్ళీ యథాప్రకారం తలపాగా, నవరణ, మేకప్, సెంట్లు అన్నీ పూర్తయ్యాయి. మళ్ళీ ఇద్దరూ రెండువేపులా నడుస్తూండగా వీథి గుమ్మం దగ్గిరకొచ్చేడు. గుమ్మం దగ్గిర కారు రెడీగా ఉంది. డ్రైవర్ డోర్ తెరచి పట్టుకున్నాడు. మళ్ళీ మామ్మూలుగానే ముందు సీట్లో సుధాకరూ, వెనక సీట్లో వర్మా, చినబాబూ పెళ్ళికొడుకూ కూర్చున్నారు. రెండు నిముషాల్లో కారు పెళ్ళికూతురిల్లు చేరుకుంది. కారు ఆగీ ఆగడంతోనే ప్రపంచం భగ్గుమని మండిపోతున్నట్టుగా గుండెలదిరేలా గందరగోళంతో బాండు మొదలయింది. పెళ్ళికొడుక్కిసారి కొంచెం గౌరవం పెరి

## చీమ

పచ్చ గడ్డి మీద
నడిచిన ఒక చీమ గురించి కదా
నువు మాట్లాడుతున్నావు
అంతే కదా!

ప్రపంచం
మనిషికోసం తయారైంది
మనకి తెలుసు

దేవుడు చేసిన ఎన్ని ఎన్ని తప్పుల్ని
సరిచేసి పారేయాలి మనం

మనిషి గ్రహణకి బాహ్యంగా చరించే
నికృష్ట జీవాల్లారా
మీకు
స్వర్గాన్నే ప్రసాదించాలి

సరి సరి
మీరు యింకో వెయ్యి రెట్లు పొడుగ్గా
వుండి
మీ చేతిలో తుపాకీయే వుంటే
మీకు గౌరవాన్నిచ్చేవాళ్ళు ఈ జనులు-
మరిగే వేడి నీళ్ళకు బదులు

మూలం: గెరివిక్
అనువాదం: స్మైల్

గింది. అతను నడిచే దారిలో తెల్లని గుడ్డ పరిచారు. దానిమీంచి నడుస్తూ లోపలికి ప్రవేశించాడు. వరండా నిండా ఆడవాళ్ళు. రంగురంగుల పట్టు చీరలు. వరండా ఆడంబరంగా కళకళ లాడుతోంది...కుతూహలంగా పెళ్ళికొడుకుని చూస్తున్నారంతా. పెళ్ళరుగు దగ్గిర కుర్చీలు వేసేరు. అందులో కూర్చున్నాడు సుధాకర్. సాంబశివరాజు తిన్నగా పీటలమీద కూర్చో పెట్టబడ్డాడు. యథాప్రకారం బేండు, మంత్రాలు, గందరగోళమూ మొదలయ్యాయి. మొహం చికాకుగా పెట్టి మళ్ళీ చెవిలో జోరీగల బాధపడలేక కొంచెం నవ్వు మొహం పెట్టి తంతులో నిశ్శబ్దంగా, ఇబ్బందిగా పాల్గొంటున్నాడు పెళ్ళికొడుకు. పెళ్ళిపీటల మీద పెళ్ళికొడుకు ఒకవైపు కూర్చొన్నాడు. మరోవైపు పెళ్ళికొడుకు మావగారు, అత్తగారు కూర్చున్నారు. అయితే అత్తగారు కనబడకుండా మట్టూ దప్పటి ఒకటి పట్టుకుని నిలబడ్డారు. కొంతసేపు ఎవరికీ అర్థంకాని సంప్రదాయ సిద్ధమైన వ్యవహారం అక్కడ నడిచింది. ఆ తర్వాత పెళ్ళికొడుకుని లోపలి గదిలోకి తీసుకెళ్ళేరు. లోపలగది విశాలంగానే ఉందిగానీ, ఓమూల అవిరేడు కుండలూ, గదినిండా ఆడవాళ్ళూ, ఓప్రక్క మగపెళ్ళివారూ అంతా కిటకిటలాడుతోంది. ఓ పావుగంట వరకూ ప్రశాంతంగా ఉంది. తరువాత అరుపులూ...కేకలూ...గందరగోళమూ...అంతే. ఒక్కసారి లైట్లారిపోయి మళ్ళీ వెలిగాయి.

"గౌరీదేవిని దాచేసేరు", "గౌరీదేవిని పట్టుకుపోయేరు" అని ఆడపెళ్ళి వారిలో కలకలం బయలుదేరింది.

సుధాకర్ చూసేడు. శ్రీను ప్రక్కన నిలబడి వాయన 'రుబ్బురోలు పాత్రం' సైలెంట్‌గా బేగ్‌లో పెట్టి ఇంకొకతనికి అందించాడు. అతను కామ్‌గా బయటికి పట్టుకుపోయేడు. సుధాకర్ బయటికి నడిచేడు. గౌరీదేవంటే రుబ్బురోలు పాత్రవా? దాన్నెందుకలా పట్టుకుపోవడం? ఎవర్నో అడిగాడు.

"గౌరీదేవంటే లక్ష్మి బాబూ! లక్ష్మిని అందుకే అలా పట్టుకుపోతారు. మళ్ళీ ఇచ్చేస్తాం. అంతే అదో సరదా".

సుధాకర్ మౌనంగా వచ్చి బయట కుర్చీలో కూర్చున్నాడు. లోపల ఉక్కలో...ఊపిరాడకుండా...ఎందుకీ బాధంతా...అనుకుని ఆలోచనల్లోకి జారిపోయేడు. కొంతసేపుపోయేక మళ్ళీ లోపలికి వెళ్ళేడు.

అక్కడ అప్పటివరకూ ఉన్న దుప్పటి తీసేసినట్లున్నారు. పెళ్ళికూతురు తల బాగా భూమిలోకి దించుకుని కూర్చుని ఉంది. "బాగానే ఉన్నట్లుంది!" అనుకున్నాడు సుధాకర్.

ఇద్దరికీ మధ్యలో ఓ కుండ ఉంది. అందులో ఒక ఉంగరం పడేసారు. ఇద్దరూ చేతులు పెట్టేరు. పెళ్ళికొడుకుని తియ్యమని మగపెళ్ళివారూ, పెళ్ళికూతుర్ని తియ్యమని ఆడపెళ్ళివారూ సతాయించేరు. మొత్తానికి రెండుసార్లు పెళ్ళికొడుకూ, ఓసారి పెళ్ళికూతురూ తీసారు. అందరిలోనూ ఆనందం...

ఒంటిగంట అయేసరికి మొత్తం పెళ్ళి తంతు అంతా పూర్తయింది.

అక్కడే ఇంకోగదిలోకి తీసుకెళ్ళారు పెళ్ళికొడుకుని. పెళ్ళికూతురి తాలూకు చుట్టాల్ని ఒక్కొక్కర్ని పరిచయం చేస్తున్నారు, సాంబశివరాజు మావగారు. ఈయన సర్కిలినస్పెక్టరుగా చేస్తున్నారు, మాతమ్ముడు ఈయన బేంక్ మేనేజరు...అంటూ.

కొత్త చుట్టరికాలు...జీవితం మరో మలుపు తిరిగినట్టనిపించిందతనికి. ఎవరో మజ్జిగ తెచ్చిచ్చేరు. మాట్లాడకుండా త్రాగేసాడు. సుధాకర్ అతనికేసి చూసి "బుర్రకథకుడి"లా ఉన్నాడు అనుకున్నాడు.

అందరూ అతనికేసే చూస్తున్నారు. ఇద్దరు మరిదళ్ళని మావగారు పరిచయం చేసేరు. ఇద్దరూ సిగ్గుపడుతూ బావగార్ని చూస్తున్నారు.

"అమ్మయ్య! ఇంకా చూపని పూర్తయిందిరా!" అన్నాడు చినబాబు.

వర్మకూడా తలూపేడు.

ఇద్దరిలోనూ గొప్ప సంతృప్తి. దగ్గిరుండి అతణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేసేనంత ఆనందం. వాళ్ళానందంలో వాళ్ళుండి అతన్ని వదిలేసారు. సాంబశివరాజు ఆలోచనలో పడ్డాడు. సాయంత్రంనించే అతనికి, తనకి తెలీని మరో లోకంలో ప్రవేశించినట్లనిపించింది. ఎందుకింత ఇంపార్టెన్స్ పెళ్ళికి, ఏంమార్పొస్తుంది జీవితంలో. వాచ్ చూసుకున్నాడు. మూడయింది.

"ఇంక బయల్దేరాలి. పెళ్ళికూతుర్ని తయారు చేయండి" అంటూ సూరిబావాజీ తొందరపెట్టేరు. మరో అరగంటలో అప్పగింతలతో కారు బయలుదేరింది. వెనకాలే బస్సు. సాంబశివరాజు కారులో వెనక్కి జేరబడి కూర్చున్నాడు. సుధాకర్ బస్ ఎక్కేసాడీసారి. కారులో మరో ఇద్దరు కొత్తగా రావడంతో వర్మకూడా కారుదిగి బస్ ఎక్కేసాడు.

"ప్రక్కనే పరిమళాలతో జీవిత భాగస్వామిని. ఆ ప్రక్కనే బోనగత్తె. ముందు సీట్లో చినబాబూ...[illegible] ముంచుకొస్తోంది" అనుకున్నాడు సాంబశివరాజు [illegible]న్నర తర్వాత ఇల్లుచేరింది కారు.

తెల్లవారుఝామున కారు తిరిగొచ్చెయ్యడం [illegible] పెద్ద హడావిడిగాలేదు ఇల్లు.

"దిష్టి" తీసి ఇద్దర్నీ లోపలికి తీసికెళ్ళేరు.

తలపాగా కారులోనే తీసి ప్రక్కన పెట్టేసాడు. బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకునేసరికి తనదైన సామ్రాజ్యంలోకి ప్రవేశించినట్లయింది. అప్పటివరకూ బిగుసుకుపోయినట్టున్న ఊపిరి ఒక్కసారే ఆడుతున్నట్లనిపించింది. పెళ్ళికి బయల్దేరి వెళ్ళిందగ్గిర్నుంచీ, అప్పటివరకూ మరోలోకంలో, మరో కృత్రిమమైన ప్రపంచంలో ఉక్కిరిబిక్కిరై వచ్చినట్లనిపించిందతనికి.

'ఒరే సాంబా! ఇంక నీతో మాకేం సంబంధంలేదు. ఈ వేళ్టినించీ నీ ఏడుపు నీది, నీ దరిద్రం, నీ చావు నీది...'అనుకుంటూ నిట్టూర్చాడు. కుండదగ్గిరకెళ్ళి మంచినీళ్ళు తీసుకుని తాగేడు. 'అమ్మయ్య! ఇదీ అసలు నిజం!...నిన్నట్నుంచీ జరిగిందంతా అబద్ధం...ఆ అబద్ధపు సుఖంకంటే ఈ నిజమే అందంగా ఉంది...' అనుకుంటూ మంచంమీద పడిపోయాడు సాంబశివరాజు...

## జంతువుల గూర్చి మహనీయుల సూక్తులు

జీవులపట్ల కనికరముగలవారే ధన్యులు. ఏలనగా అట్టివారినే భగవంతుడు కనికరించును.

— ఏసుక్రీస్తు

* *

సర్వజీవ సౌభ్రాతృత్వమే గొప్ప మతం. అంటే సర్వజీవులు నీతో సమానమని భావించడం!

— గురునానక్

* *

మానవులపైనే గాక నిస్సహాయ మూగ జీవులపై గూడా కనికరము, దయాళుత్వము చూపని నాగరికత సంపూర్ణమైనది కాదు.

— విక్టోరియా మహారాణి

## సుభాషితాలు

ఎన్నడూ ప్రాణము తీయనివానిని, మాంసం భుజించని వానిని సర్వజీవులు కలిసి చేతులు కలిపి పూజిస్తాయి.

— తిరువల్లువర్

* *

జీవులను హింసించుట పాపమా? ఔను, పాపమే. ఆ పాపము మనయొక్క అతి పిరికితనమును తెలియజేయుచు మనలను మిక్కిలి అవమానపరిచే పాపమై యున్నది.

— ఆర్చిబిషప్ బాగ్‌షా

* *

జంతుహింస అవివేకమైన చర్య మాత్రమే కాక భగవంతుని అవమానపరచే క్రియ.

— థామస్ న్యూటన్

* *

సచేతన జీవులను హింసించడమే జీవితపు విలువ అయినపుడు అట్టి బతుకును జీవించేందుకే నిరాకరించాలి.

— మహాత్మా గాంధీజీ

సేకరణ: పీలా రామకృష్ణ
గుంటూరు